హైదరాబాద్ వార్త

## వ్యవసాయ విశ్వ విద్యాలయం 18వ అకడమిక్ కౌన్సిల్ సమావేశం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ 18వ అకాడమిక్ కౌన్సిల్ సమావేశం శనివారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తెలంగాణ రా ష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి ఉప కులపతి ఎం.రఘునందన్ రావు అధ్యక్షతన జరిగింది.వర్సిటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.సుధీర్ కుమార్,ఫ్యాకల్టీ డీన్స్,అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు కలిసి 19 అంశాలపై చర్చించారు.2023-24 విద్యా సంవత్సరానికి పిజి కోర్సులలో సీట్లను 210 కి పెంచుతూ కౌన్సిల్ తీర్మానం చేసింది.పిహెచ్‌డి కోర్సు సీట్లను 61కి పైగా నిర్ధారించింది.2023-24 విద్యా సంవత్సరంలో బిఎస్‌సి (హానర్స్) అగ్రికల్చర్ కోర్సులలో 955 సీట్లు,బిటెక్ (అగ్రికల్చరల్) ఇంజనీరులో 87 సీట్లు,బి.టెక్ ఫుడ్ టెక్నాలజీలో 77 సీట్లు, బిఎస్‌సి (హానర్స్) కమ్యూనిటీ సైన్సులో 121 సీట్ల భర్తీకి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.60



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి ఉప కులపతి ఎం.రఘునందన్ రావు,రిజిస్ట్రార్ ఎస్.సుధీర్ కుమార్

సీట్లతో అదిలాబాద్‌లో కొత్త వ్యవసాయ కళాశాలను ప్రారంభించటానికి కూడ అకాడమిక్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది.డిప్లొమో కోర్సులలో 760 సీట్లకు ఆమోదం తెలిపింది.ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఛాన్సు దొరికితే చాలు..

### నిర్మాణం జరుగుతుందా.. వాలిపోతారు ▫ వసూళ్లకోసం కార్పొరేటర్ల ఆగడాలు

- ఏదో సాకులు చెప్పి నిలిపివేత
- టౌన్ ప్లానింగ్ సిబ్బంది ద్వారా కబురు
- మరోవైపు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వసూళ్లు
- గగ్గోలు పెడుతున్న నిర్మాణదారులు

"రూ.కోట్లు ఖర్చుపెట్టి గెలిచాం. ఆదాయం అనుకున్నంత రావడంలేదు. వార్డులో ఎక్కడైనా భవన నిర్మాణాలు జరుగుతుంటే చెప్పండి. సొంత ఇల్లు అయినా, అపార్టుమెంటు అయినా.. నిర్మాణదారులను నన్ను కలవమని చెప్పి పంపించండి" ఇది కొంత మంది కార్పొరేటర్లు.. టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఇచ్చిన ఆదేశాలు.

హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త : మహానగరం చుట్టుపక్కల 22 పురపాలికలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిల్లో నగరానికి అనుకుని ఉన్న మున్సిపాలిటీల్లో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ స్థలాలు అందుబాటులో ఉండటంతో ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నిర్మాణ పనులు చేపడితే..స్థానిక ప్రజాప్రతినిధులు చేరుకుంటున్నారు. భవనం, అదనపు అంతస్తులు, విస్తీర్ణం.. ఇలా లెక్కలు గట్టి మరీ రేట్లు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వార్డు అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందే సమాచారం సేకరించి కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, నగర శివారు ప్రాంత చౌదరిగూడ లాంటి గ్రామపంచాయతీల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు రింగ్‌గా మారి నిర్మాణ ఫర్మిషన్లు, డబ్బుల వసూళ్లకు కమిటీని నడిపిస్తున్నారు. కొంత మంది కార్పొరేటర్లను కలవనిదే ఆ డివిజన్లలో నిర్మాణాలు ప్రారంభించే పరిస్థితి లేదంటే దందా ఏ స్థాయిలో వుందనేది అర్థమమవుతుంది. కొంత మంది ప్రజాప్రతినిధులకు భవన నిర్మాణాలను ఆదాయ వనరుగా చూస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ద్వారా నిర్మాణదారులపై ఒత్తిడి తెచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్డర్ల నుంచి సొంత ఇల్లు కట్టుకునే వారి వరకూ ఎవరినీ వదలడం లేదు. రూ.20 వేల నుంచి ఇరవై లక్షల వరకూ తీసుకుంటున్నారు. భవన నిర్మాణం మొదలు పెట్టాలంటే చాలు..గద్దల్లా వాలిపోతున్నారు. విస్తీర్ణం ఇంటి ఖర్చు అంచనావేసి..రేట్లు నిర్ణయించేస్తున్నారు. అంతే.. అడిగినంత ఇవ్వాల్సిందే..లేకపోతే భవానికి అనుమతి లేదనో..సెట్‌బ్యాక్ నిబంధన పాటించలేదనో, ఎల్‌ఆర్‌ఎస్ కట్టినా కట్టలేదనో చెప్పి నిలిపివేయించేస్తున్నారు. ప్రజలు అధికారుల మధ్య




వారధిగా ఉంటూ సమస్యలు పరిష్కరించాల్సిన కొందరు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అడ్డగోలు వసూళ్లకు తెగబడుతున్నారు. జిహెచ్‌ఎంసి, నగర శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో స్థానిక ప్రజాప్రతినిధుల వ్యవహారశైలితో ప్రజలు విసుగెత్తిపోతున్న పరిస్థితి నెలకొంది.

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో ఒక కార్పొరేటర్ భర్త తన పర్యటన సందర్భంగా ఒకచోట ఇల్లు నిర్మించడం చూశారు. ఇంటికి వెళ్లి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్ చేసి ఆ భవనం గురించి వివరాలడిగి, ఇంటి యజమాని తనను కలవాల్సిందిగా చెప్పాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఆదేశం మేరకు ఆ ఇంటి యజమాని..సదరు కార్పొరేటర్‌ను కలవగా.. మీ ఇంటి చుట్టుపక్కల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయంటూ బెదిరించి కొంత మొత్తం వసూలు చేశారు. బొడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొందరు కార్పొరేటర్లు తమ వార్డులో జరిగే నిర్మాణాల నుంచి మామూళ్లు వసూలు చేసే బాధ్యతను టౌన్‌ప్లానింగ్ సిబ్బందికే అప్పగించేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఒక కార్పొరేటర్ తన వార్డులో ఎవరైనా ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపడితే అక్కడకు వెళ్లి బిల్డర్ లేదా నిర్మాణదారుడిని తన కార్యాలయానికి రావాలని ఆదేశిస్తున్నారు. తన వార్డులో అక్రమ నిర్మాణాలు జరగడానికి వీల్లేదని, తక్షణం నిలిపివేయాలంటూ బెదిరించి తర్వాత తన దారికి తెచ్చుకుంటారని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చెబుతున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్లలో కొద్దిమంది మినహా అందరూ ఇదే పంథాను అనుసరిస్తున్నారని జిహెచ్‌ఎంసి సిబ్బంది, శివారు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పేర్కొంటున్నారు.

నగరంలో ఎక్కడ నిర్మాణం ప్రారంభమైనా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వాలిపోతారు. ప్రజాప్రతినిధులకు తమపై అధికారులకు ఇవ్వాలంటూ భవన విస్తీర్ణం బట్టి లంచం డిమాండ్ చేస్తారు. వ్యక్తిగత ఇళ్లను కూడా వదలరు. ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టినప్పటికీ స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఏవో ఉల్లంఘనలు ఉన్నా యని బెదిరిస్తుంటారు. ఇకవేళ ఎవరైనా కాదంటే మాత్రం వారికి నోటీసులు జారీచేసి భయాందోళనకు గురిచేస్తున్నారు. దీంతో తలనొప్పి ఎందుకనే భావనతో నిర్మాణదారులు, బిల్డర్లు వారికి అడగకుండానే లంచాలను ఇస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు కల్పించుకుని ఈ తరహా దందాకు పుల్‌స్టాప్ పెట్టాలని కోరుతున్నారు.ఇక్కడ వసూళ్ల వ్యవహారంపై రాష్ట్ర పెద్దల వరకు ఫిర్యాదులు వెళ్లినా.. బయటకు పొక్కకుండా వసూలు చేసుకోవాలని సలహా ఇస్తున్నారని ప్రచారం నడుస్తుండడం గమనార్హం.

## ఐపిఎల్ మ్యాచ్‌లకు పటిష్ట బందోబస్తు

### రాచకొండ సిపి డిఎస్ చౌహాన్


ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిపి డిఎస్ చౌహాన్ ఇతర అధికారులు

ఉప్పల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 2వ తేది నుంచి జరిగే టాటా ఐపిఎల్ - 2023 మ్యాచ్‌లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సిపి దేవేంద్రసింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టేడియం బందోబస్తు ఏర్పాట్ల గురించి అడిషనల్ సిపి సత్యనారాయణ, మల్కాజిగిరి డిసిపి జానకి, ట్రాఫిక్ డిసిపి మహంతిలతో కలిసి వివరించారు. స్టేడియంలో జరిగే ఐపిఎల్ మ్యాచ్ వీక్షించేందుకు 40వేల మంది వస్తారని అంచనా వేస్తున్నామని, స్టేడియం భద్రత కోసం సుమారు 1500 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మ్యాచ్ రోజు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు స్టేడియంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రతా విభాగం నుంచి 250 మంది, ట్రాఫిక్ నుంచి 403, శాంతిభద్రతల నుంచి 1091 మంది, టిఎస్‌ఎస్‌పి నుంచి నాలుగు ప్లాటూన్ల సాయుధ బలగాలు, రెండు ఆక్టోపస్ బృందాలు, మౌంటెడ్ పోలీస్‌లు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. వీటితోపాటు పది వజ్ర, ఎస్‌బి, సిసిఎస్, ఎస్‌ఓటి, అగ్నిమాపక స్క్వాడ్, రెండు ఫైర్ టెండర్లు బందోబస్తులో మోహరిస్తున్నట్లు తెలిపారు. స్టేడియం చుట్టు పక్కల కవర్ చేసేందుకు 340 సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, స్టేడియంలో జాయింట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బిడి టీమ్‌లతో మ్యాచ్ ముగిసే వరకు పూర్తి స్థాయిలో తనిఖీలు జరుగుతాయని, స్టేడియం గేట్‌ల వద్ద సిఐ స్థాయి అధికారులు ఉంటారని, పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలలో భద్రతా ఏర్పాట్లతోపాటు, విధ్వంసక చర్యలకు వ్యతిరేకంగా తనిఖీలు చేసేందుకు, వ్యక్తులను పరీక్షించేందుకు అన్ని ఎంట్రీ గేటల్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల తనిఖీ చేసేందుకు ప్రతి గేటు వద్ద మొబైల్ టెక్నీషియన్ నియమించామని, ఆక్టోపస్, ఎన్‌జిఎస్ జట్లతో అన్ని సమయాల్లో చుట్టు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గేట్ నెం.1, 3,4,7,8 వద్ద మౌంటెడ్ పోలీస్ ఫోర్స్ నియమించామని, మెట్రో రైళ్లు అర్థరాత్రి ఒంటి గంట వరకు నడిపిస్తారని తెలిపారు. మహిళలపై ఈవ్ టీజింగ్‌ను నియంత్రించేందుకు షీటీమ్స్, యాంటీ ఈవ్ టీజింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు సూచించిన విధంగా ఆహార విక్రేతలు వారి రేట్లను నియంత్రించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మ్యాచ్ స్పాన్సర్లు, వెండర్‌లు ఇతర సిబ్బంది వివరాలు తనిఖీ చేసి ఫోటోలతో కూడిన పాసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రేక్షకులు సులువుగా స్టేడియం వద్దకు చేరుకునేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, జెన్‌ప్యాక్ట్ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు, ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి విశాల్ మార్ట్ రామంతాపూర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా విక్రయాలకు, వాహనాలను పార్కు చేసేందుకు అనుమతి లేదని, టిఎస్‌ఐఐసి పార్కింగ్ కేంద్రాలలోనే వాహనాలు పార్కు చేసుకోవాలని సూచించారు. గేట్లు తెరిచి ప్రేక్షకులను రెండు గంటలకు ముందుగానే లోపలికి అనుమతిస్తామని, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఉదయం ఒంటి గంట వరకు మెట్రో రైళ్లు..** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో టాటా ఐపిఎల్ మ్యాచ్‌ల సందర్భంగా మ్యాచ్‌లు జరిగే ప్రతి రోజు రాత్రి ఒంటి గంట వరకు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నామని మెట్రో రైలు అధికారులు తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున ఉదయం ఒంటి గంటల వరకు ప్రత్యేక రైలు నడుస్తాయని తెలిపారు. అమీర్‌పేట, జేబీఎస్ పేరెడ్‌గ్రౌండ్స్ నుంచి కనెక్టింగ్ రైళ్లు ఉంటాయని, ప్రత్యేక రైళ్ల సేవ సమయంలో ఉప్పల్ స్టేడియం, ఎన్‌జిఆర్‌ఐ స్టేషన్‌లలో మాత్రమే ప్రవేశాలు అనుమతి ఉంటుందని తెలిపారు. ఇతర స్టేషన్లల నిష్క్రమణల కోసం మాత్రమే తెరుచుకుంటాయన్నారు. రిటర్న్ టిక్కెట్‌ను ముందుగాను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం క్యూలో నిలబడకుండా ఉండేందుకు స్మార్ట్ కార్డులను ఉపయోగించాలని సూచించారు. రాత్రి 10.15 గంటల తర్వాత డిజిటల్ టిక్కెట్లు విక్రయించడం లేదన్నారు. ఉప్పల్ స్టేడియం , ఎన్‌జిఆర్‌ఐ స్టేడియం వద్ద మాత్రమే పనిచేస్తాయని తెలిపారు.

**స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..** ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్‌లు జరిగే సమయంలో ట్రాఫిక్ దారి మళ్లిస్తామని ట్రాఫిక్ డిసిపి మహంతి తెలిపారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే భారీ వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా దారి మళ్లిస్తామని, ఉప్పల్ స్టేడియం లోపలి రహదారిలోకి వాహనాలు అనుమతి లేదన్నారు. వాహనదారుల కోసం ప్రత్యేకంగా 21 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, ప్రజలు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జేబు దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అగ్నిమాపక, మెడికల్ సిబ్బందితో ఏడు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రేక్షకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్ చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, హెచ్‌సిఏ నిర్వాహకుల సహకారంతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిహెచ్‌ఎంసి మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచుతుందని తెలిపారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : ఎర్రోళ్ల శ్రీనివాస్



రెజిమెంటల్ బజార్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మెడికల్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని, భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్‌లు తెలిపారు. శనివారం రెజిమెంటల్ బజార్‌లోని కాళికదేవి ఆలయంలో షిరిడి సాయిబాబా జన్మదిన వేడుకల ముగింపు ఉత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు సృజన్ ముదిరాజ్, షర్వీన్, ఆలయ ప్రతినిధులు నంది కంటి రవి, జ్ఞానేశ్వర్, చంద్రకుమార్, సతీష్, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బిసి కులగణన జరిగే వరకు ఉద్యమం ఆగదు

**ఏప్రిల్ 3,4 తేదీల్లో జరిగే ఛలోఢిల్లీ విజయవంతం చేయాలి**

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య**


అభివాదం చేస్తున్న ఎర్ర సత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం

హైదరాబాద్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త: జనగణనలో బిసి కులగణన చేసే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని ఏప్రిల్ 3,4 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం కాచిగూడలో బిసి సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో భాగంగా బిసిల కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బిసిలు ఓట్లు వేస్తేనే ఎంపిలు, కేంద్రమంత్రులు, ప్రధానమంత్రులు అఆయ్యారని గుర్తుచేస్తూ అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓట్లేసే యంత్రాలుగానే వాడుకుంటున్నాయన్నారు. 75 సంవత్సరాలుగా బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు.బిసిడిమాండ్ల సాధనకు వేలసార్లు జంతర్‌మంతర్ వేదికగా ధర్నాలు,ర్యాలీలు, ముట్టడిలు నిర్వహిస్తున్నామని డిమాండ్లను సాధించుకునే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని బిసిల ఓట్లు కావాలని కానీ బిసిల డిమాండ్లు పట్టించుకోరా అని కృష్ణయ్య ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, విద్యార్థి సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వాగార్డ్, హిందుస్థాన్ యూనీలీవర్ సంస్థల నకిలీ విక్రయాలతో వినియోగదారులకు కుచ్చుటోపీ

- 11లక్షల విలువైన వస్తువుల స్వాధీనం
- ప్రజల ఆరోగ్యాలతో దండుకుంటున్న
- నలుగురు దళారుల ముఠా అరెస్టు
- ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసుల సూచన


స్వాధీనం చేసుకున్న నకిలీ ఉత్పత్తులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : ఆక్వాగార్డ్ వాటర్‌ఫిల్టర్లతోపాటు హిందుస్థాన్ యూని లీవర్ సంస్థల నకిలీ ఉత్పత్తులతో వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి సుమారు రు.లు.11లక్షల విలువైన నీటి ఉత్పత్తుల వినియోగ వస్తువులను స్పెషల్ ఆపరేషన్‌టీమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాలానగర్ జోన్ పోలీసు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దేశంలోని ఢిల్లీతోపాటు ఇతర ప్రాంతాలనుండి కెంట్, ఆక్వాగార్డ్‌తోపాటు హిందుస్థాన్ యూని లీవర్ వంటి ప్రముఖ నీటి శుద్ధి పరికరాలను నకిలీలను ఉత్పత్తిచేసి విక్రయిస్తున్న ముఠాకు చెందిన కూకట్‌పల్లి మహంకాళీ నగర్‌కు చెందిన రింకునవీ, శ్రావన్‌నిశాత్, కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన పామత్తి నాగదాసు, టస్‌కర్ ప్రసాద్‌లను అదుకులోని తీసుకున్నారు. కూకట్‌పల్లి అసిస్టెంట్ పోలీసు కమిషనర్ చంద్రశేఖర్ నాయకత్వంలో వీరిని విచారించగా నకిలీవస్తువుల విక్రయం విషయం బయటపడింది. వీరివద్దనుండి కెంట్, ఆక్వాగార్డ్, హిందుస్థాన్ యూనిలీవర్ సంస్థలకు చెందిన సుమారు రూ.లు.11లక్షల విలువైన వస్తువులను స్వాదీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహంకాలీనగర్‌లో గల శ్రీ శారదా ఎంటర్‌ప్రైజెస్, కెపిహెచ్‌బికాలనీలోని బ్లూ ఆక్వా వాటర్‌సొల్యుషన్స్ దుకాణంలో పాటు, కెపిహెచ్‌బికాలనీలోని లింపిండ్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణాలపై దాడులు నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌టీమ్(ఎస్‌ఓటి) పోలీసులతో పాటు కూకట్‌పల్లి సహాయ పోలీసు కమిషనర్ చంద్రశేఖర్ సారధ్యంలో కూకట్‌పల్లి, కె.పి.హెచ్‌పి పోలీస్‌స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు దాడులతో పాల్గొని నకిలీ వస్తువులను స్వాదీనం చేసుకున్నట్లు బాలానగర్ డిసిపి శ్రీనివాసరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో స్పెషల్ ఆపరేషన్ టీమ్ అడిషనల్ డిసిపి శోభన్, కూకట్‌పల్లి అసిస్టెంట్ పోలీసు కమిషనర్ చంద్రశేఖర్, కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మా, కె.పి.హెచ్.బి. కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్, స్పెషల్ ఆపరేషన్‌టీమ్ బాలానగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్‌లతోపాటు వారి బృందాలు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

**6కేజీల గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**


స్వాధీనం చేసుకున్న బుల్లెట్, గంజాయి చూపుతున్న పోలీసులు

దుండిగల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేడ్చల్ ఏసిపి వెంకట్‌రెడ్డి ఇందుకు సంబందించిన వివరాలను వెల్లడించారు. బొల్లారంకు చెందిన ధరమ్ రాజ్ అలియాస్ చుంచుల్(26) అనే వ్యక్తి విశాఖపట్నం పరిధి పాడేరూకు చెందిన సిద్దు అనే వ్యక్తి వద్ద గంజాయిని తీసుకొని ట్రైన్‌లో హైదరాబాద్‌కు చేరుకున్నాడు. సదరు గంజాయిని దేవరయాంజల్‌కు చెందిన మల్లోలా ఆనంద్(20)కు ఇవ్వాల్సి ఉండగా అతనిని గండిమైసమ్మలోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్దకు రమ్మని కోరాడు. దీంతో మార్చి31న మధ్యాహ్నం 1:30 గంల సమయంలో ఆనంద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్ (టిఎస్08జేజి7649)పై ఎస్‌బిఐ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే విశ్వసనీయ సమాచారం ఉన్న మేడ్చల్ ఎస్‌వోటి పోలీసులు దుండిగల్ ఎస్సై రాజేష్ తన సిబ్బం దితో కలిసి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారి శైలిలో విచారించగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్నట్లు నేరం అంగీకరించారు. వారి వద్ద 6.430 కిలోగ్రాముల గంజాయి, బుల్లెట్ మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి శనివారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు దుండిగల్ సిఐ రమణారెడ్డి, ఎస్‌వోటి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు వారిని సిబ్బందిని ఏసిపి అభినందించారు.

### సామూహిక సంకీర్తనార్చన, భక్తి గీతాల కార్యక్రమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: తాళ్ళపాక అన్నమాచార్యుల వారి 615 జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సంకీర్తనార్చన, భక్తి గీతాల కార్యక్రమం అందరిని అలరించాయి. వేసవి-సంగీత శిక్షణా శిబిరం-2023 కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు అకాడమి ప్రిన్సిపాల్ జి.లక్ష్మణమూర్తి(ఏఐఆర్, టీవీ ఆర్టిస్ట్), డైరెక్టర్ వసుధామూర్తి వివరించారు. శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా సుదర్శన లక్ష్మణసమేత సీతారామచంద్రస్వామి దేవాలయం(సైదాబాద్) అకాడమి విద్యార్థులతో భక్తిగీతాల కార్యక్రమం నిర్వహించారు.

## వేసవి కాలంతో జూపార్కులోని జంతువులు,పక్షుల ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు




జూపార్కులోని జంతువులు



చార్మినార్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : వేసవి కాలం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని జంతువులను ఎండ వేడిమి నుంచి కాపాడటానికి జూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.గత కొద్ది రోజులుగా రోజు,రోజుకు ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. జూపార్కులో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఎండ తగల కుండ ఉండేలా ఎన్‌క్లోజర్లు వద్ద 80 కూలర్లు, ఎయిర్ ఫ్యాన్లు ఏర్పాట్లు చేశారు.ప్రతీ రోజు మూడు సార్లు జంతువులకు చల్లని నీరును పైపులతో సిబ్బంది చల్లుతున్నారు.ఎన్‌క్లోజర్లు వద్ద రెండు వందల రెయిన్ గన్స్, పక్షులు ఎన్‌క్లోజర్లు వద్ద 1000 ఫగ్గర్స్, జంతువులు,పక్షుల ఎన్‌క్లోజర్ల షెల్టర్లు వద్ద 1000 కేజీల తుంగ గడ్డి కప్పారు.అదే విధంగా వేసవి కాలం సందర్భంగా జూపార్కులోని పక్షులు, చిలుకలు, కోతులకు పలు రకాల పండ్లు తినిపిస్తున్నారు. జూపార్కు సిబ్బంది మూడు సార్లు చల్లని నీరు పక్షులపై చల్లుతున్నారు.వేసవి కాలంలో జూపార్కులోని సింహాలు,పులులుతో పాటు ఇతర జంతువులకు,అదే విధంగా వివిధ రకాల పక్షులు, చిలుకలు ఇతర పక్షులకు సైతం గూక్లోన్-డి,విటామిన్ సి,ఎల క్ట్రోకల్ ఫౌడర్,బి.కాంప్లెక్స్ ట్యాబ్‌లెట్లను నీటిలో కలిపి అందిస్తున్నారు.వేసవి కాలం సందర్భంగా జూపార్కులోని జంతువులు,పక్షులను ఎండ వేడిమి నుంచి కాపాడటానికి అన్ని ఏర్పాట్లు చేశామని జూ పార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజిరావు పాటిల్ వెల్లడించారు.

**సందర్శకులతో కళకళ లాడుతున్న నెహ్రూ జూలాజికల్ పార్కు**

హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శకులతో కళకళ లాడుతున్నది.శని,ఆదివారాలు రోజులలో దాదాపు పదిహేను వేల మంది సందర్శకులు జూపార్కును చూడటానికి వస్తుంటారు.పర్యాటకులు జూపార్కులోని జంతువులను ఎంతో ఆసక్తితో తిలకిస్తున్నారు.నిత్యం జూపార్కు పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. 1963 సంవత్సరం కంటే ముందు పబ్లిక్ గార్డెన్‌లోని బాగేఆమ్‌లో జూపార్కు ఉండేది. 1963లో పబ్లిక్ గార్డెన్ నుంచి బహదూర్‌పుర శివారు ప్రాంతానికి తరలించారు.1963 అక్టోబరు నెల 6వ తేదీన అప్పటి రాష్ట్ర గవర్నర్ నాగేష్ జూపార్కును ప్రారంభించారు.380 ఎకరాల స్థలం విస్తీర్ణంలో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో 150 ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. జూపార్కు లోని ఎన్‌క్లోజర్లలో వివిధ రకాల దాదాపు రెండు వేల జంతువులు, పక్షులు ఉన్నాయి. 2021వ సంవత్సరం డిసెంబరు నెల ఇరవై మూడవ తేదీన జూపార్కులో బర్డ్స్ ఎవియార్‌న్ ఏర్పాటు చేశారు. పలు రకాల రామ చిలుకలు, పావురాలు,నెమళ్లు, ఊర పిచ్చుకలు,అమెజాన్ అడవులలో ఉండే గోల్డెన్ మకావ్,కార్డిలైట్ మకావ్,గ్రీన్ వింగ్ మకావ్‌తో పాటు తెల్ల నెమళ్లు,ఎన్నో రకాల పక్షులు ఈ బర్డ్స్ ఎవియార్‌లో ఉన్నాయి.56 రకాలకు చెందిన 680 చిలుకలు,పక్షులు కూడ బర్డ్ ఎవియార్‌లో కనిపిస్తాయి.కింగ్ కోబ్రా, రక్త పింజరితో పాటు 16 రకాలకు చెందిన వంద పాములు,ఒకటి ఆడ,మూడు మగ ఖడ్గ మృగాలు,రెండు మగ,రెండు ఆడ నీటి గుర్రాలు,రెండు మగ జిరాఫీలు, చిరుత పులులు మూడు,అడవి కుక్కలు నాలుగు,దుప్పులు 250,సింహాలు 21,పులులు 20,ఏనుగులు నాలుగు ఉన్నాయి. జూపార్కులో ఉన్న తాబేళ్లలో 123,93 సంవత్సరాలు వయస్సు గల తాబేళ్ల రెండు ఉన్నాయి.నెహ్రూ జూలాజికల్ పార్కులో 1974 సంవత్సరంలో దేశంలోనే మొదటి సారిగా సఫారి పార్కును ఏర్పాటు చేశారు.

## పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

**కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ**



విద్యార్థులకు జామంట్రీ బాక్సులు, పెన్నులు అందచేస్తున్న కార్పోరేటర్ రచనశ్రీ

ధర్నాచౌక్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త: పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ సేవా సంస్థలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ కొనియాడారు. శనివారం దోమలగూడలోని భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ స్కూల్ విద్యార్థులకు అప్స ఆధ్వర్యంలో మా ఆపీకి ఛాయా స్వచ్ఛంధ సంస్థ సహకారంతో జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ నాగరాజుతో కలసి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ ఇది పరీక్షల సమయం కాబట్టి విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి పరీక్షలు బాగారాసి, తాము చదుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మా ఆపీకి ఛాయా వ్యవస్థాపకుడు పిట్టల ధీరజ్ కుమార్, అప్స ప్రతినిధులు బొట్టు రమేష్, శ్రావణి, లావణ్య, మాఆపీకీ ఛాయా సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, స్థానిక బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట అభివృద్ధికి నిరంతరం కృషి : లింగాని



అడ్డగుట్ట డి-సెక్షన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశాల వారిగా పరిష్కరిస్తున్నామని డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని డి-సెక్షన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిరు ధాన్యాలు తింటే ఎన్నో ప్రయోజనాలు : కొంతం దీపిక



అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు న్యూట్రీషన్ ఫుడ్డును అందజేస్తున్న కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: అంగన్‌వాడి కేంద్రాలకు పోషణ అబియాన్‌లో భాగంగా చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రీషన్, చిరు ధాన్యాల్లో ఎంతో నాణ్యత ఉందని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. కుమ్మరిగూడలోని అంగన్‌వాడి కేంద్రంలో ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రీషన్ ఫుడ్డును శనివారం ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్ సునందా, అంగన్‌వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది

హైదరాబాద్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త: కరోనా విలయతాండవం చేస్తున్న వేళ మందులు అవసరమైన వారికి ఆన్‌లైన్ ద్వారా పంపిణీ చేసినందుకు గానూ ఎమర్జింగ్ ఫార్మలీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని డాక్టర్స్ ఫార్మాఎండీ డాక్టర్ సునీత అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల అవార్డు అందుకున్న సునీతను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో ఆటు వివిధ వ్యాధులతో భాదపడుతూ మెడిసిన్స్ వాడుతున్న వారిపై దుష్పరిణామాలను ముందుగానే గుర్తించి ఫార్మాకో జెనోమెక్స్ పరీక్షను పరిచయం చేసినందుకు తనకు అవార్డు ఎంపిక చేశారని తెలిపారు. ఇండియా ఫార్మా వరల్డ్ అవార్డ్స్‌లో భాగంగా ముంబై నగరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్లు చెప్పారు. దీంతో తనపై మరింత భారం పెరిగిందని చెప్పారు. దేవుడి తర్వాత దేవుడిగా కొలిచే వైద్యవృత్తిలో ఉన్న తాను జీవించినంతకాలం తనవంతు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

### హక్కుల పరిరక్షణకు పాటుపడిన బాబు జగ్జీవన్‌రాం

అప్జల్‌గంజ్,ఏఫ్రిల్ 1ప్రభాత వార్త: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ హక్కులను కల్పిస్తే,వాటి పరిరక్షణ కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి దివం గత దేశ తొలి ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రాం అని గోషామహాల్ నియోజక వర్గం బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కట్టెలమండిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్,జగ్జీవన్‌రాం విగ్రహాల ప్రారంభోత్సం లో ఆయన పాల్గొన్నారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు మహానీయుల జయంతి ఉత్సవాలు ఏఫ్రిల్ మాసంలో రావడం సంతోష దాయక మన్నారు. ఈకార్యక్రమంలో రాజు,జి.నంద్‌కుమార్ పాల్గొన్నారు.

## ఒడిస్సా మహిళా మోర్చా అధ్యక్షురాలికి ఘన స్వాగతం



శృతి పట్నాయక్‌ను సత్కరిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ ఒడిస్సా మహిళా మోర్చా అధ్యక్షురాలు శృతి పట్నాయక్ శనివారం హైదరాబాద్ నగరానికి విచ్చేసిన సందర్బంగా హిమాయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆనేక మంది మహిళా మోర్చా కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెను మహాలక్ష్మి ఘనంగా సత్కరించారు. వారు ఇరువురు కొన్ని రాజకీయ విషయాలతోపాటు యోగ క్షేమాలపై కొంతసేపు ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, మాధవి, కవిత, శారద, పూజజైస్వాల్, మధు, యుపిహెచ్‌సికి చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత ముఠాజైసింహా

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర యువనేత ముఠాజైసింహా పిలుపునచ్చారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో స్థానిక మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, జి.పరుశురామ్, పోతుల శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, పున్న రాజ్‌మోహన్, గుండు జగదీశ్, ముచ్చకుర్తి పద్మ, ముఠా శివసింహా, రవిశంకర్‌గుప్త, పిఎస్.శ్రీనివాస్, ట్రేడ్ సెల్ అధ్యక్షుడు, శ్రీధర్‌రెడ్డి, సాయిచణక్యరెడ్డి, జి.వెంకటేశ్, ఎం.దేవయ్య, గడ్డమీది శ్రీనివాస్, వనజ, శివకుమారి, స్వరూప, మంజు, అర్చన, భాగ్య, సుధా, సత్య, ప్రవీణ, పద్మ తదితరులు పాల్గొన్నారు. 7న స్థానిక జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో జరిగే పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, జిల్లా పార్టీ ఇంచార్జ్ దాసోజు శ్రావణ్, నగర అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ తదితర ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నేతలపైనే ఉందని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్నాయని ముఠాజైసింహా అన్నారు.

## స్వయం సహాయక గ్రూపులతో ఆర్థికాభివృద్ధి

**కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్**



మహిళలకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త : స్వయం సహాయక గ్రూపులతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని మహిళా గ్రూపులకు రూ.1.2 కోట్ల నిధులు మంజూరు కావరడంతో శనివారం టోలిచౌకిలోని పార్టీ కార్యాలయం వద్ద వారికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు స్వయం సహాయక గ్రూపులు ఎంతగానో ఉపయోగపడాయన్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభమయ్యే ఈగ్రూపులకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ రుణాలకు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి గ్రూపుకు రూ. 10 లక్షల చెక్కులను అందజేశారు. వీరి వెంట లంగర్‌హౌస్ డివిజన్ మజ్లిస్ నాయకురాలు మత్స్యరేణుక, కార్వాన్ 13 సర్కిల్ డిపోఓ లలితకుమారి, మహిళలు పాల్గొన్నారు.

## 4న రవీంద్రభారతిలో అంబేద్కర్ విగ్రహా స్వాగత సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త: అంబేద్కర్ దూరదృష్టి ఆర్థిక విధానాలు దేశాభివృద్ధికి ఒక దిక్సూచీలాంటివని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ అన్నారు. అంబేద్కర్‌ను ఒక దళితుడిగానూ, రాజ్యాంగ నిర్మాతగానూ మాత్రమే అందురూ భావిస్తారని ..కానీ ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. అంబేద్కర్ మహా విగ్రహా స్థాపన ,రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ నామకరణాన్ని స్వాగతిస్తూ ..హైదరాబాద్ రవీంద్రభారతి లో ఏప్రిల్ 4తేదీ మహా విగ్రహా స్థాపన స్వాగత మహాసభను నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్, సమతా సైనిక్‌దళ్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దాసరి శ్యామ్ మనోహన్, సమతా సౌనిక్‌దళ్ సౌత్‌ఇండియా ప్రధాన కార్యదర్శి రవీందర్ నారాయణ, సంపత్ తదితరులు హాజరై గోడపత్రికను అవిష్కరించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఈసభకు యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ ముఖ్య అతిధిగా హాజరువుతున్నారని అలాగే తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, టిఎస్‌పిఎస్సీ, మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య, కాకి మాధవరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

### కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తాం: బిజెపి మహిళా మోర్చా

మన్సూరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: బిజేపి జాతీయ మహిళా మోర్చా పిలుపు మేరకు రంగారెడ్డి అర్బన్ బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు నందికొండ గీతారెడ్డి ఆద్వర్యంలో తెలంగాణ ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని మహిళా మోర్చ జాతీయ కార్యవర్గసభ్యులు ఆకుల విజయతో పాటు పార్టీ మహిళలు సందర్శించారు.ఈ సందర్బంగా ఆసుపత్రిలో వసతులతో పాటు వైద్యుల సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర నిధులను ప్రజలను చేర్చకుండా కేసిఆర్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

## సాటి మనిషిని మనిషిగా గౌరవించడమే సనాతన ధర్మం

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.బి.ఎల్.ఎన్.చక్రవర్తి**



సనాత ధర్మచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందిస్తున్న దృశ్యం

తిరుమలగిరి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: చాటి మనిషిని మనిషిగా గౌరవించినప్పుడే సమాజంలోని అందరు ఆనందంగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.బి.ఎల్.ఎన్.చక్రవర్తి అన్నారు. సనాత ధర్మచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ రామనవమి ప్రతిభా పురస్కారాలను సికింద్రాబాద్ తివోలీ గార్డెన్‌లో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీ స్వాతంత్ర్య వాదంపై అనేక రచనలు చేసి వారి హక్కుల సాధన కోసం కృషి చేసిన విద్యావేత్త రచయిత్రి అమృతలత, ప్రసిద్ధ హిందీ అధ్యాపకులు డాక్టర్ సంగిరాల రాజేంద్రప్రసాద్, అధ్యాపకురాలు డాక్టర్ నందివాడ అనంత లక్ష్మిలను ఆయన ప్రశంసించారు. చాటి మనిషిని మనిషిగా గౌరవించినప్పుడే అందరు ఆనందంగా ఉంటారన్నారు. ప్రతిభా పురస్కారాలను అందించడం తన అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం సనాత ధర్మ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ రాజ్‌కందుకూరి మాట్లాడుతూ సద్గుర్ శివానంద మూర్తి ఆదేశాల మేరకు గత మూడు దశాబ్ధాలుగా పలు రంగాల్లో విశేష కృషి చేస్తూ సమాజాబివృద్ధికి పాటుపడుతున్నవారిని గుర్తించి వారిని ఘనంగా సత్కరిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎల్.వి.సుబ్రమణ్యం సి.మురళీ క్రిష్ణ,గోపాల్ రెడ్డి, రాజేశ్వరీ, భసవరాజ్, ఆనంద్, డాక్టర్ ప్రభాకర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## పవిత్రతను చాటడమే ఉగాది ప్రత్యేకత : డా. కె.వి.రమణాచారి



డా. ఎం.కె.రాముకు ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న రమణాచారి, నరసింహారెడ్డి, ప్రసాద్ తదితర అతిథులు

నాంపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : మన సంస్కృతి, సంప్రదాయాలు, పవిత్రతకు నిదర్శనం ఉగాది పండుగని, సృజన భారతి సుమారు 8వ దశకంలో ఉన్న సాహితీ, సాహిత్యమూర్తులను ఎంపికచేసి వారికి శ్రీశోభకృత్‌నామ ఉగాది పురస్కారాలను ప్రదానం చేయడం ఆ పవిత్రతను చాటుతుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. ఇలాంటి పెద్దవయస్కులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మూరిప్రసాద్ కొలమానంలేని ప్రేమాభిమానంతో పురస్కారాలివ్వడం, వారు ఒప్పుకోవడం ప్రమోదమని ఆయన అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు, డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. ఏనుగు నరసింహారెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. కె.వి.రమణాచారి వివిధరంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. చింతపల్లి వసుంధరారెడ్డి, డా. ఎం.కె.రాము, డా. ముదిగంటి సుజాతారెడ్డి, డా. పాల్వాయి సుమతీనరేంద్ర, వనం శంకరయ్య, నార కృష్ణమూర్తి, మేకా రామకృష్ణ, బి.వెంకటరమ ణలను ఘనంగా సత్కరించి ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు. సభకు ముందు సిద్ధేంద్ర కళాపీఠం విద్యార్థులచే ప్రదర్శింపబడిన కూచిపూడి నృత్యం ఆహుతులకు నేత్రపర్వం కావించి, మంత్రముగ్ధులను చేసింది.

### ప్రతిభావంతులైన మహిళలకు మిట్టల్ ఎక్సలెన్సీ అవార్డ్స్ ప్రదానం

రవీంద్రభారతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : సోనమ్ మిట్టల్ ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఎనిమిది రంగాలలో ప్రతిభావంతులైన మహిళలకు మిట్టల్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ శివకుమార్ మిట్టల్ మీడియాకు తెలిపారు. ముఖ్యంగా ఎక్సలెన్సీ ఇన్ జర్నలిజం, కల్చరల్ ఆర్ట్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్లీ చాలెంజ్, హెల్త్‌కేర్ అండ్ నర్సింగ్, స్పోర్ట్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ డెవలప్‌మెంట్ ఇన్ రూరల్ ఏరియా తదితర ఎనిమిది రంగాలలో నిష్ణాతులైన మహిళల నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక అవార్డు జ్యూరీ ఎంపికచేసిన అవార్డు గ్రహీతలను ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా మే 14న ప్రశంసాపత్రం, జ్ఞాపిక, నగదు బహుమతితో ఘనంగా సత్కరించి మిట్టల్ ఎక్సలెన్సీ అవార్డ్ 2023ను ప్రదానం చేయనున్నట్లు శివకుమార్ మిట్టల్ పేర్కొన్నారు.

### ఎమ్మెల్సీని కలిసి దళితసంఘాల ఐక్యవేదిక నూతన కమిటి



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయభాస్కర్‌రావు తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దళిత సంఘాల ఐక్యవేదిక కమిటి నూతన కార్యవర్గం సభ్యులు శనివారం ప్రభుత్వ విప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ నూతన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నూతన కమిటి చైర్మన్ భూదాల విజయభాస్కర్ రావు, కార్యదర్శి జిజె రత్నం, కోశాధికారి రాసిమల్ల యాదగిరి, ఫౌండర్ ప్రెసిడెంట్ రామడుగు సిద్దయ్య, ప్రేమ్‌కుమార్, నరసింహులు, సాంబ, సాల్మన్‌రాజు, సాయన్న, రావిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు

నార్సింగి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త : మణికొండ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిఉలు శనివారం 'వీడ్కోలు సమావేశం'ను ఘనంగా నిర్వహించారు. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ పూర్థి సహకారం అందించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పదో తరగతిలో 100.శాతం ఉత్తీర్ణత సాధించేందుకు శక్తివంచన లేకుండా మా ఉపాధ్యాయులంతా కష్టపడి చదువులు చెప్పారని తెలిపారు. విద్యార్థులు సైతం ఇష్టంగా చదివారని, ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించామన్నారు. అనంతరం ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేశామని తెలిపారు. దాతల సహకారంతో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, బాటనీ, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక తరగతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులకు స్నాక్స్ కూడా ఇచ్చామని తెలిపారు. వందశాతం ఫలితాలు వస్తే చాలా సంతోషిస్తామన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు రాఘవేంద్ర, శ్రావణ్‌లు విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు కావాల్సిన పెన్నులు, స్కేల్ తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, నాయకులు లక్ష్మణ్‌రావ్, సత్యారెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ఏర్పుల కుమార్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, భరత్‌రెడ్డి, పుల్లారావ్, గంగాధర్‌శాస్త్రి, దిలీప్, సందీప్, సిద్దు, యాలాల కిరణ్, శ్రీనివాస్‌రావ్, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త: సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన అనుభవిస్తున్న విశ్వబ్రహ్మణులను ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మసంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2వేల కోట్లు కేటాయించాలని అలాగే 50ఏళ్లు దాటిన ప్రతి విశ్వకర్మకు 5వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే స్వర్ణకారులు, వడ్రంగి కులాల వారిపై పోలీసు, అటవీశాఖ అధికారుల దాడులను అరికట్టాలన్నారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న విశ్వకర్మలకు వడ్డీ లేని రుణాలు ,ఉచిత విద్యుత్‌ను అందించాలని కోరారు. ఈసందర్భంగాఎల్బీనగర్ చౌరస్తాకు శ్రీకాంతచారి పేరు పెడుతున్నామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి,యూత్ ప్రెసిడెంట్ ఉదారపు నర్సింహ్మాచారి,అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయంగా సాగిన 'బాపురమణ లోగిలి'



చిత్రకారుడు బ్నింను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: బాపు రమణీయ లోగిలి-శ్రీబాపురమణీయం పేరిట పున్నాగ వన మిత్ర ఆధ్వర్యంలో పున్నాగవనం ఆత్మీయ సదస్సు నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ పొన్నాడ విజయం వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. సుబ్బారావు స్వాగతం పలుకుతూ విఖ్యాత రచయిత బాపురమణలపై మైత్రి బంధం ప్రేరణగా 'పున్నాగ వన సన్మాన' కార్యక్రమం, పున్నాగ వనం సదస్సు నిర్వహించామన్నారు. ప్రముఖ చిత్రకారుడు బ్నిం, ప్రముఖ రంగస్థలనటుడు డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ, శంకు, సినీనటుడు జెన్నీలను సత్కరించారు. వన సంరక్షణ బృందం సభ్యులు వేలూరు శ్రీనివాసులు, తెన్నేటి వెంకటకృష్ణమూర్తి, వెంపటి సతీష్, కొండ్రు పద్మజ, కొండ్రు రాజీ, పిఎస్.శైలజ విజయ్ తదితరులు పాల్గొనగా కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పిఎంకె.గాంధీ వ్యవహరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా : శ్యామ్‌కుమార్

తిరుమలగిరి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని మాజీ బోర్డు సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు పరిధిలోని జె.ఎన్.ఎన్.యు. ఆర్.వై.పథకం కింద పేద ప్రజలకోసం నిర్మించిన కాలనీలోని బ్లాక్ నెం 8 వద్ద పవర్‌బోర్ చెడిపోవడంతో స్థానికులు మాజీ బోర్డు సభ్యుడికి నీటి సమస్య కొరతపై తెలిపారు. వెంటనే స్పందించిన శ్యామ్‌కుమార్ సంబంధిత బోర్డు అధికారులకు నీటి సమస్యను వివరించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది పవర్‌బోర్ మరమ్మత్తులు చేపట్టడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్‌కుమార్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామన్న యువసేన సభ్యులు రాజారెడ్డి, వి.రాజు, శ్రీను, కె.నందకుమార్.శంకర్ పాల్గొన్నారు.

## హార్మోన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

హయత్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా అనెస్తెటిక్, హార్మోన్ ఇంజక్షన్లను అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఎల్.బి.నగర్ ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... మహారాష్ట్రకు చెందిన బాలాజీ ధర్మాజీ ప్రస్తుతం హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. హయత్‌నగర్‌లోని మరో ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ప్రసాద్ గులాబ్‌రావు బాలాజీకి బంధువు. ఇరువురు విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన ఇరువురు మెడికల్ ఫీల్డులోని అనుభవాన్ని ఉపయోగించుకుని డబ్బులు సంపాదించాలని పన్నాగం పన్నారు. శరీరాకృతిని పెంచే, కండరాలను గట్టిపడేలా చేసే స్టెరాయిడ్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఈక్రమంలో 250-300 రూపాయల ధర ఉండే ఇంజక్షన్లను గంజాయికి అలవాటుపడిన వారికి వెయ్యి నుంచి 2 వేలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 31న రాత్రి ఎల్.బి.నగర్ ఎస్.వో.టి పోలీసులు హయత్‌నగర్ పోలీసులతో కలిసి వారిని వలపన్ని పట్టుకుని వారినుంచి మొత్తం 30 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు.


## అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రారంభోత్సవం



అంబేద్కర్,జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

అప్జల్‌గంజ్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: అబిడ్స్ కట్టెలమండి డబుల్ బెడ్‌రూమ్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రారంభోత్సవంలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు నందకిషోర్‌వ్యాస్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్,ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్,నిర్వాహకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం కోస పథకాలు



గోల్కొండ జిల్లా మహిళామోర్చ సమావేశంలో మహిళల ప్రతినిధులు

గోషామహల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: భారతీ జనతా పార్టీ గోల్కొండ జిల్లా మహిళా మోర్చ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బిజెపి జాతీయ మహిళా కార్యవర్గ సభ్యురాలు మాధవిబూటా దేశంలో మూడవ సారి దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాటిని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆమెతీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేశారు.గోల్కొండ జిల్లా బిజెపి మహిళా మోర్చ ఇన్‌చార్జ్ రఘునందన్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈకార్యక్రమంలో మహిళా మోర్చ నాయకురాలు సుమలత,కరుణా,యాదవ్,సవితా జైస్వాల్, కాజల్‌ఖుశ్వ, స్వప్నగెగెనా,కె.విజయలక్ష్మి, రాజేశ్వరి, మనీషా,కల్పనశర్మ,దీపాఅవస్థి,విషాశర్మ,శ్వేతా, నాగమణి, భగవతి,మమతా,ప్రాచీజైన్ పాల్గొన్నారు.

### 'బాలానందం వేసవి శిక్షణా శిబిరాలు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: బాలానందం ట్రస్ట్ ఆధ్వర్యంలో 'బాలానందం వేసవి శిక్షణా శిబిరాలు' మే 1వ తేదీ నుంచి జూన్ 1వతేదీ వరకు నారాయణగూడలోని భవన సముదాయంలో జరుగుతాయని ట్రస్ట్ కార్యదర్శి జె.వి.కామేశ్వరి వివరించారు. నృత్యం, లలిత సంగీతం, నటన, చిత్రలేఖనం తదితర అంశాలలో శిక్షణ పొందవచ్చని, తరగతులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయన్నారు.

## కామినేనిలో నేటి నుండి లివర్ హెల్త్ స్క్రీనింగ్ ప్యాకేజ్ ప్రారంభం



లివర్ హెల్త్ స్కీం పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

**మన్సూరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** లివర్‌సంబందిత వ్యాధులతో బాధపడే వారి కోసం లివర్ హెల్త్ స్క్రీనింగ్ ప్యాకేజ్‌ను ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రి యాజమాన్యం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు మరియు హెపటాలజిస్టు డాక్టర్ పరాగ్ దశాత్వార్ మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లుతో పాటు ధూమ పానం, మద్యపానం వంటి అలవాట్ల కారణంగా ఎక్కువగా లివర్ సంబంధిత వ్యాధులతో బాదపడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సంవత్సరంలో ఒక్కసారైనా లివర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. దీర్ఘకాలంగా లివర్ వ్యాధులతో బాదపడుతూ ఎక్కువ ఖర్చు భారించలేని వారికోసం రూ. 8 వేల విలువచేసే ఈ ప్యాకేజ్‌ను కేవలం రూ. 1700 కే అందిస్తున్నామన్నారు. ఈ ప్యాకేజ్‌లో సిబిపి, ఎల్‌ఎఫ్‌టి, ఆంటీ హెచ్‌సివి, హెచ్‌బిఏ 1సి, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, యూపిడ్ ప్రోఫైల్, లివర్ స్పెషలిస్టు కన్సెల్టెంట్‌ను అందిస్తుందన్నారు. అదే విదంగా ఈ ప్యాకేజ్ ఈ నెల 15వ తేదివరకు ఉంటుందని, ఈ ప్యాకేజ్ తో పాటు ఫైబ్రోస్కాన్‌ను సైతం ఉచితంగా అందిస్తున్నామన్నారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిషన్, కృష్ణతేజ్, కార్తికేయన్ రామన్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ సత్యనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**మలక్‌పేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాదారణ, ప్రధాన కలశస్థాపన, గణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమం, అనంతరం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద నివేదన చేసారు. అదేవిధంగా డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి కాటపల్లి రాజేశ్వరరావు, జంగంగౌడ్, జంగారెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీలో స్వచ్ఛా ప్రతిజ్ఞ

**తుర్కయంజాల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ అన్ని కాలనీలు, గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛా ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సాబేర్‌అలీ మాట్లాడుతూ పుర స్వచ్ఛతకు ప్రజలంతా భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతకు తోడ్పడవలసిన భాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
















## బడంగ్‌పేట్ కార్పొరేషన్ అంచనా బడ్జెట్ రూ.80.30 కోట్లకు ఆమోదం



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అంచనా బడ్జెట్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.80.30 కోట్లకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. కార్పొరేషన్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను మున్సిపల్ సాధారణ నిధులనుండి రూ.80.30 కోట్లకు సంబంధించిన అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో సమావేశానికి హాజరైన డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌లకు సంబంధించిన కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రూ.80.30 అంచనా బడ్జెట్‌తో పాటు క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్ నుండి 59.30 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులకు సంబంధించిన రూ.5 కోట్లు కలిపి మొత్తం 144.62 కోట్ల నిధులపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి ఫ్లోర్ లీడర్లు సూర్ణగంటి అర్జున్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఎస్ఎన్‌డిపి పనుల కోసం 44 కోట్లు కేటాయించాం: పారిజాత**

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఎస్ఎన్‌డిపి పనుల కోసం కార్పొరేషన్ తరపున రూ.44 కోట్లను కేటాయించామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. బడ్జెట్ సమావేశం అనంతరం కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మంత్రి కెటిఆర్ శంకుస్థాపన చేసిన ఎస్ఎన్‌డిపి పనులు ప్రారంభమై సంవత్సరం పైన అవుతున్నా అసంపూర్తిగా ఉన్నాయనీ బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్లు పనులు అర్థాంతరంగా ఆపడంతో నివాస ప్రాంతాల్లో నిలిచిన పనులు ప్రజలకు ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆగిన పనులకు ఎవరు బాధ్యత వహించాలని ఆమె ప్రశ్నిస్తూ పనుల విషయంలో కార్పొరేషన్ బడ్జెట్ ఇవ్వడం లేదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె తెలిపారు. ఎస్ఎన్‌డిపి పనుల పూర్తి కోసం ఇప్పటికే బిల్లులు చెల్లించామనీ ఎస్ఎన్‌డిపి అక్కౌంట్‌లో కూడా జమ చేశామని ఆమె వెల్లడించారు. ఎస్ఎన్‌డిపి పనుల కోసం రూ.44 కోట్ల బడ్జెట్ ఇస్తామన్న జిహెచ్ఎంసి 4 రూపాయలు కూడా ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. పనులు ఆగిన డివిజన్ల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కార్పొరేషన్ తరపున అసంపూర్తి పనుల కోసం బడ్జెట్ కేటాయించామని మేయర్ వెల్లడించారు. కార్పొరేషన్ అంచనా బడ్జెట్‌ను ఆమోదించిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులకు పారిజాత కృతజ్ఞతలు తెలిపారు.




## పెంచిన టోల్‌గేట్ చార్జీలను తగ్గించాలని లారీ యజమానుల సంక్షేమ సంఘం నిరసన

**వనస్థలిపురం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** దేశ వ్యా ప్తంగా ఉన్నటువంటి టోల్ ప్లాజాలలో కేంద్ర ప్రభుత్వం నేటినుండి టోల్‌గేట్ చార్జీలను 5.5% పెంచడాన్ని ఖండిస్తూ ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.నందారెడ్డి డిమాండ్ చేస్తూ ఆటోనగర్‌లోని ఇసుక లారీల అడ్డా వద్ద భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు, అదేవిధంగా లారీ యజమానులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన డీజిల్ ధరలను వెంటనే జిఎస్‌టిలోకి తీసుకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్నటువంటి వ్యాట్‌ను తగ్గించి భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఇన్సూరెన్స్ థర్డ్ పార్టీ ప్రీమియం కూడా భారీ స్థాయిలో వసూలు చేస్తు న్నారని ఇన్సూరెన్స్‌ను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాల వైఖరిని దుయ్య బట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేసారం బాల్‌రెడ్డి, సుర్వి యాదయ్యగౌడ్, బూడిద రామ్‌రెడ్డి, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి కొండె శ్రీశైలం, ఆకుల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, లారీ యజమానులు పాల్గొన్నారు.




## పార్టీ అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేయాలి

**కుషాయిగూడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. అధిష్టానం పిలుపుమేరకు కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ ఎర్రలలిత గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంకి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి టిఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో ప్రబుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమన్నారు. కాప్రా డివిజన్ వార్డ్ కార్యాలయ నిర్మాణానికి కృషి చేస్తామని ఆయనతోపాటు డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సుడుగు మహేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, మహిళా అధ్యక్షురాలు సురేఖ, తదితరులు పాల్గొన్నారు.




## మల్కాజిగిరిలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అధ్యక్షతన గౌతమ్‌నగర్‌లోని లక్ష్మీసాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంబీపూర్ రాజు, ఇన్చార్జ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం సాధించుకున్న తర్వాత సిఎం కెసిఆర్ ఏ రాష్ట్రంలో అమలు చేయనటువంటి పథకాలు మన తెలంగాణలోనే ప్రవేశపెట్టి పేద బడుగు బలహీన వర్గాలను ముందుకు తీసుకు వచ్చారని అన్నారు. కళ్యాణ లక్ష్మి, దళితబంధు, ఆసరాపింఛన్లు వంటి పథకాలు ప్రవేశపెట్టి దేశం మొత్తం తెలంగాణవైపు చూసేవిధంగా చేసారని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి బిఆర్ఎస్ పార్టీని విజయపథం దిశగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత రామూయాదవ్, ప్రేమ్‌కుమార్, మీనా ఉపేందర్‌రెడ్డి, శాంతి శ్రీనివాస్ రెడ్డి, జితేంద్రనాథ్, గజ్జెల నాగేష్,నాయకులు జగదీష్‌గౌడ్, పిట్ల శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, జిఎన్‌వి సతిష్ కుమార్, రామూయాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్‌రెడ్డి, ఆమీనుద్దిన్, విజయకుమారి, సుమలతయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

























